క్లుప్తంగా

నేడు 'స్పందన '

నెహ్రూనగర్: స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా శ్రీ షిరిడి సాయి సేవా ట్రస్ట్ వార్షికోత్సవం



పాత గుంటూరు: రాజా గారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో షిరిడి సాయి సేవా ట్రస్ట్ 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌరీ శంకర్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా బీబీఎం గ్రూప్ డైరెక్టర్ బి.వి.ఎస్.కె.రత్నం, గిరిధర్ అశ్విని, టి.అరుణ్ శ్రీ కుమార్ పాల్గొని ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సంస్థ సావనీర్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్ ఆవిష్కరించారు. తొలుత హైదరాబాద్‌కి చెందిన లక్ష్మీ ప్రవీణ భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సంస్థకు చేయూతనందించిన దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అనురాధ, గొల్ల నారాయణ మూర్తి, ఆదిలక్ష్మి, ఇమ్మడి రామకృష్ణ, రమణి, హరేకృష్ణ గోపాల్, డాక్టర్ నాంచారయ్య, వేదాంతం సాయి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ముక్తి వీధికి చెందిన షేక్ యాసిన్(23)కు అదే ప్రాంతానికి చెందిన జబీనాకు 4 నెలల క్రితం వివాహం అయింది. జబీనా గర్భిణి కావడంతో పుట్టింటికి వెళ్లింది. మానసికంగా కుంగిపోయి ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శావల్యాపురం మండలం కారుమంచికి చెందిన రావూరి సాయికుమార్(28) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఈనెల 10వ తేదీ ఓ లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నాడు. రెండు రోజులుగా రూము తలుపులు తెరవలేదు. అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రూము తలుపులు బలవంతంగా తెరవగా సాయికుమార్ పురుగులు మందు తాగి మృతి చెంది ఉన్నాడు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనివాసరావుపేటకు చెందిన 62 సంవత్సరాల నాగిరెడ్డి వెంకటరమణ ఈ నెల 12వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

నెహ్రూనగర్: పేద విద్యార్థికి స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి రూ.25 వేలు సాయం అందించారు. గుంటూరు నగరంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన ఉమర్ ఫరూక్‌కు ఫౌండేషన్ తరఫున గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, నేతలు ఆలా కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం



చుట్టుగుంట పోలేరమ్మతల్లి ఆలయంలో బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



ఏటీ అగ్రహారం గాయత్రీ మందిరంలో..



కొత్తపేట జగన్నాథ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీ దేవిగా..



లాలాపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీ దేవిగా..



శ్రీ సాయినాథ సన్నిధానంలో..

పాత గుంటూరు: నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్ అగ్రహారం కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం, చుట్టుగుంట పోలేరమ్మతల్లి దేవస్థానం, బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఏటీ అగ్రహారంలోని గాయత్రీ మందిరం, విద్యాగర్‌లోని శ్రీ సాయినాథ సన్నిధానంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా, కొత్తపేట శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మీదేవిగా, లాలాపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య కళావేదికపై ప్రముఖ సాహితీవేత్త ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి దేవీవైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆలయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వాస్పత్రుల్లో జీరో వేకెన్సీ విధానం
- గ్రామస్థాయిలోనే అధునాతన వైద్యం
- శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి



లేళ్ల అప్పిరెడ్డిని సన్మానిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్

నెహ్రూనగర్: ప్రజారోగ్యమే లక్ష్యంగా విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టి ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. జీరో వేకెన్సీ విధానంతో ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయడమే కాక గ్రామస్థాయికి అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. గుంటూరు ప్రభుత్వ సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి విప్‌గా నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా ప్రభుత్వాస్పత్రిలో పలు మార్పులకు శ్రీకారం చుడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌ను అప్పిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఘనకీర్తి ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలకు మళ్లీ మహర్దశ పట్టించేలా కృషి చేయాలని నూతన ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ టీటీకే రెడ్డిని కోరారు. ఆస్పత్రి గురించి డాక్టర్ కిరణ్, కళాశాల గురించి డాక్టర్ టీటీకే రెడ్డి అనేక అంశాలను అప్పిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తమ దృష్టికి తెచ్చిన వాటిని ప్రభుత్వ పెద్దలతో చర్చించి పరిష్కరించేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అప్పిరెడ్డి చెప్పారు.

అవయవ దానంపై చైతన్యం తీసుకురావాలి

నగరంపాలెం: అవయవ దానంపై ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ అన్నారు. జీజీహెచ్‌లో ఆదివారం సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, వైద్యులు ఎస్ఎస్‌వీ రమణ అధ్యక్షత వహించారు. సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రిలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఈ క్రమంలోనే లివర్, కిడ్నీ, గుండె మార్పిడి చేసేందుకు గుంటూరు జీజీహెచ్‌ను గుర్తించిందని చెప్పారు. దీనికై అవసరమైన అనుమతులు జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నారని అన్నారు. త్వరలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్థివదేహాలను అవయవ దానం చేసిన దాతలను, మెడికల్ కళాశాలలకు దానం చేసే దాతలను రాష్ట్ర ప్రభుత్వం గౌరవ మర్యాదలతో ప్రోత్సహిస్తోందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైద్యరంగాన్ని మరింతగా బలోపేతం చేస్తున్నారని అన్నారు. అవయవ దానం చేసేందుకు ముందుకొచ్చిన 20 మంది దాతలను అభినందించారు. కార్యక్రమంలో అనటామి విభాగాధిపతి సావిత్రి, స్పెక్ట్ చైర్‌పర్సన్ జి.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా



సమావేశంలో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

నెహ్రూనగర్: బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. 12వ వార్డులోని ఏపీ రాష్ట్ర రజక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు కాకుమాను ఉమ మహేశ్వరరావు ఆధ్వర్యంలో బీసీ రజక ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో బీసీలకే అధిక ప్రాధాన్యం ఉందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు కోసం టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి, కాని అందుకు భిన్నంగా ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి బీసీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ రాచకొండ జాన్ బాబు, 15వ వార్డు కార్పొరేటర్ రామనబోయిన అజయ్, క్లస్టర్ ఇన్‌చార్జి హన్నుబాయ్, వార్డు ప్రెసిడెంట్ సలీం, నందేటి రాజేష్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి బండి అందజేత

నియోజకవర్గ పరిధిలో చిరు వ్యాపారి షేక్ గౌస్‌కు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఆదివారం నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా తోపుడు బండిని అందజేశారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శప్రాయం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

నెహ్రూనగర్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శప్రాయమని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా కొనియాడారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆదివారం తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంజుమాన్ గుంటూరు అధ్యక్షుడు షేక్ కర్నూమా పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: అబ్దుల్ కలాం నడిచిన దారి అసాధారణమైనదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు పండిట్ రాజన్న మాస్టర్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థలో..

గుంటూరు ఎడ్యుకేషన్: అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. అరండల్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి, టి.విజయ్‌కుమార్, ఉద్యోగులు సీహెచ్ వంశీకృష్ణ, జె.పర్వీన్ సుల్తానా, వైసీపీ కార్యకర్తలు నవీన్, మనోజ్, ఐటీ విభాగ అధ్యక్షుడు మాదాసు కిరణ్ పాల్గొన్నారు.

అడివి బాపిరాజు కవిత్వంలో ప్రకృతి వర్ణనలు ప్రత్యేకం

పాత గుంటూరు: అడివి బాపిరాజు కవిత్వంలో ప్రకృతి వర్ణనలు ప్రత్యేకం అని, అందులో ప్రపంచ ప్రయోజనం కనిపిస్తోందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన సభకు యర్రగుంట్ల పాణీరావు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ గొప్ప నవల రచయితగా, చిత్రసీమలో గొప్ప కళా దర్శకులుగా విభిన్న రీతులలో అడివి బాపిరాజు కవిత్వం రమణీయంగా రాశారని చెప్పారు. రైతులు, యానాదులు, రకరకాల పీడితుల గురించి ఆయన కవిత్వంలో వివరించారని వివరించారు. ఉమా మహేశ్వరరావు రచించిన 'సిపాయి కథలు' గురించి డాక్టర్ యలవర్తి భవాని వివరించారు. 'ఈ మాసం కవి'గా ప్రముఖ సినీ రచయిత కనగాల జయకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మీ నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమంలో డాక్టర్ రామడుగు వెంకటేశ్వరశర్మ, ఇ.చంద్రయ్య, గడల శివప్రసాద్, వి.వి.రావు, బండికల్లు జమదగ్ని, సత్యవతి, మన్నం వెంకట గురువు పాల్గొన్నారు. అనంతరం కనగాల జయకుమార్‌ను డాక్టర్ రావి రంగారావు సత్కరించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో బీజేపీ గుంటూరు జిల్లా నూతన అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్‌కు ఆత్మీయ అభినందన సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు కొత్తూరి వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూపూడి రంగరాజు పాల్గొని జిల్లా అధ్యక్షులుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ, శనక్కాయల అరుణ, భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, బిట్రా శివన్నారాయణ, యువమోర్చ రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీకృష్ణ, వల్లూరు జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

గుంటూరు 'శ్రీ విద్యా' వస్త్రాలయంలో దసరా ఆఫర్స్



పాత గుంటూరు: బ్రాడీపేట నాలుగో లైనులోని ప్రముఖ వస్త్ర సంస్థ 'శ్రీ విద్యా' ఉమెన్ ఫ్యాషన్ షోరూంలో దసరా పురస్కరించుకుని ఈ నెల 24 వరకు ఫెస్టివల్ సేల్ ఆఫర్స్ 30 శాతం వరకు అందిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓం ప్రకాష్ తెలిపారు. కాంచీవరం పట్టు, డిజైనరీ శారీస్, ప్యూర్ టస్సర్ శిల్క్ శారీస్, బెనారస్, సూట్స్, సల్వార్స్, కుర్తీస్ అనేక వస్త్రాలు నూతన డిజైన్లలో సరికొత్త స్టాక్ అందుబాటులో ఉందని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.